పాత్రికేయులకు రక్షణ కల్పించాలి

ఈసీకి ఎడిటర్స్ గిల్డ్ వినతి

న్యూఢిల్లీ: ఎన్నికల్లో పాత్రికేయ విధులను నిర్వహించేవారికి రక్షణ కల్పించాలని ఎన్నికల కమిషన్ (ఈసీ)ని ఎడిటర్స్ గిల్డ్ కోరింది. వృత్తి పరమైన విధులను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు రాష్ట్రాల్లోని పోలీసులకు ఆదేశాలివ్వాలని కోరింది. ఎన్నికల ప్రచారాన్ని రిపోర్ట్ చేసే పాత్రికేయులు వేధింపులకు, దాడులకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది.

బీజేపీకి 200 సీట్లు దాటవు

- కమలం పార్టీకి వ్యతిరేకంగా దేశంలో బలమైన సెంటిమెంట్
- సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అంచనా

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఈసారి 200 సీట్లు కూడా దాటబోవని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అంచనా వేశారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా బలమైన సెంటిమెంట్ ఉందని సోమవారం కోల్‌కతాలో ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార సభల్లో మంగళసూత్రాలు, గేదెలు అంటూ ప్రధాని మోదీ చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రశాంత్ స్పందిస్తూ.. ఈ ఎన్నికలు తన పట్టు నుంచి జారిపోతున్నాయని ప్రధాని మోదీ గ్రహించారని, అందుకే ఆయన నిరాశతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. అనేక కారణాల వల్ల బీజేపీకి వ్యతిరేకంగా దేశమంతా బలమైన సెంటిమెంట్ ఉందని, బీజేపీ ప్రజాస్వామ్యానికి ముప్పు అని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. అధికారాన్ని ఉపయోగించి ప్రతిపక్ష నేతలను జైళ్లకు పంపించడం, ప్రతిపక్షాలకు డబ్బు అందకుండా చేయడం వంటి వాటి వల్ల ప్రజల్లో బీజేపీపై చాలా కోపం ఉందన్నారు. బీజేపీ ప్రజాదరణ దిగజారడానికి ఆ పార్టీ చేస్తున్న మతపరమైన ప్రచారమూ కారణమేనన్నారు. ప్రజలు ఇలాంటి వాటిని ఇష్టపడరని, దేశాన్ని బలహీనపరిచేలా మతం ఆధారంగా దేశాన్ని చీల్చే ప్రయత్నంగా చూస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ ఈసారి రాబోదని, 200 సీట్లు దాటడానికే ఆ పార్టీ చాలా కష్టపడుతున్నదని చెప్పారు.

ఎన్డీయేకు మ్యాజిక్ ఫిగర్ రాదు

మొదటిపేజీ తరువాయి...

వేసే పని చేసేవాడినని, ఇప్పుడు భవిష్యత్తును నిర్మించే పని చేస్తున్నట్టు చెప్పారు. తాను ఇటీవల కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్, బీహార్‌లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేశానని తెలిపారు.

తగ్గనున్న ఎన్డీయే సీట్ల సంఖ్య

2019లో బీజేపీకి ఒంటరిగా 303, ఎన్డీయేకి 353 సీట్లు రాగా ఈసారి భారీగా తగ్గనున్నట్టు యోగేంద్ర చెప్పారు. కర్ణాటకలో కనీసం 10 స్థానాలు, మహారాష్ట్రలో 10 స్థానాలు, రాజస్థాన్, గుజరాత్ కలిపి 10 స్థానాలు తగ్గనున్నట్టు అంచనా వేశారు. హర్యానా, పంజాబ్, ఛండీగఢ్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లో కలిపి 10 స్థానాలు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ కలిపి 10 స్థానాలను ఎన్డీఏ కోల్పోతుందన్నారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో కలిపి 15 సీట్లు, బీహార్‌లో 15 సీట్లు, పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కలిపి మరో 10 స్థానాలు తగ్గుతాయన్నారు. కాగా, తమిళనాడు, కేరళ, తెలంగాణలో కలిపి 5 సీట్లు పెరుగొచ్చని, ఆంధ్రప్రదేశ్‌లో 10 సీట్లు పెరుగుతాయని చెప్పారు. మొత్తంగా బీజేపీకి ఒంటరిగా 233 స్థానాలు, ఎన్డీయేకు 268 సీట్లకు మించి రావని చెప్పారు.

సుశీల్ కుమార్ మోదీ కన్నుమూత

పాట్నా: బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత సుశీల్ కుమార్ మోదీ(72) సోమవారం కన్నుమూశారు. గత కొన్ని నెలలుగా ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆరోగ్యం సహకరించకనే లోక్‌సభ ఎన్నికలకు కూడా ఆయన దూరంగా ఉన్నారు. మంగళవారం పాట్నాలోని నివాసంలో ఆయన అంతిమ సంస్కారాలు జరగనున్నట్టు కుటుంబసభ్యులు చెప్పారు. మోదీ రాజ్యసభ ఎంపీగా ఒకసారి, రెండు సార్లు రాష్ట్రమంత్రిగా పని చేశారు.

నాలుగో విడతలో 64% పోలింగ్

తెలంగాణ, ఏపీ సహా 10 రాష్ట్రాల్లోని 96 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు

బెంగాల్‌లో అత్యధికంగా 75.56%, జమ్ముకశ్మీర్‌లో అత్యల్పంగా 37% ఓటింగ్

ఏపీ, బెంగాల్‌లో పలు చోట్ల ఘర్షణలు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకీ ముగిసిన పోలింగ్



యూపీలోని బహ్రైచ్‌లో ఓటేసేందుకు క్యూలో నిలుచున్న తరు గిరిజనులు

న్యూఢిల్లీ: నాలుగో విడతలో భాగంగా దేశ వ్యాప్తంగా 10 రాష్ట్రాల్లోని 96 లోక్‌సభ స్థానాలకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. రాత్రి 10 గంటల సమయానికి 64.05 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. జమ్ముకశ్మీర్‌లో అత్యల్పంగా 37.93 శాతం, పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 75.56 శాతం ఓటింగ్ నమోదైనట్టు తెలిపింది. ఏపీలో 72 శాతం, బీహార్‌లో 56.75%, జార్ఖండ్‌లో 64.59%, మధ్యప్రదేశ్‌లో 71.72%, మహారాష్ట్రలో 57.58%, ఒడిశాలో 64.81%, తెలంగాణలో 64%, ఉత్తరప్రదేశ్‌లో 58.05 శాతం పోలింగ్ నమోదైనట్టు వెల్లడించింది.

బెంగాల్, ఏపీలో ఘర్షణలు

పోలింగ్ సందర్భంగా పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఏపీలో అధికార వైస్సార్‌సీపీ, టీడీపీ శ్రేణులు ఘర్షణకు దిగాయి. ముఖ్యంగా పల్నాడు, కడప, అన్నమయ్య జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. వేమూరు నియోజకవర్గంలో ఐదు పోలింగ్ బూత్‌లను టీడీపీ నేతలు నియంత్రణలోకి తీసుకున్నారని వైసీపీ ఆరోపించింది. కుప్పం నియోజకవర్గంలో పోలింగ్ అధికారి టీడీపీతో కుమ్మక్కై రిగ్గింగ్‌కు పాల్పడ్డారని పేర్కొన్నది. తెనాలిలో వైసీపీ ఎమ్మెల్యే శివకుమార్ ఓ ఓటరుపై చేయిచేసుకోవడం వివాదానికి దారితీసింది. రైల్వే కోడూరు నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ నాయకుల కార్లు ధ్వంసమయ్యాయి. చిత్తూరు గుడిపాల మండలంలో తమ పార్టీ ఏజెంట్‌ను పొడిచారని వైసీపీ ఆరోపించింది. రెంటచింతల మండలంలో తమ పార్టీ శ్రేణులపై వైసీపీ దాడులకు దిగిందని టీడీపీ ఎమ్మెల్సీ మొహమ్మద్ అహ్మద్ షరీఫ్ ఈసీకి ఫిర్యాదు చేశారు. పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్, బీజేపీ నేతల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. బర్ధమన్-దుర్గాపూర్ బీజేపీ అభ్యర్థి దిలీప్ ఘోష్ కాన్వాయ్‌పై రెండు చోట్ల రాళ్లదాడి జరిగింది. బీర్‌భూమ్, క్రిష్ణానగర్ నియోజకవర్గాల్లోనూ రెండు పార్టీల నేతల మధ్య ఘర్షణలు జరిగాయి. మరోవైపు, సరైన రోడ్లు, అభివృద్ధి లేదని నిరసిస్తూ ఉత్తరప్రదేశ్‌లో పలు గ్రామాల ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు.

379 స్థానాలకు ఎన్నికలు పూర్తి

నాలుగో విడతలో భాగంగా తెలంగాణలో 17, ఏపీలో 25, యూపీలో 13, బీహార్‌లో 5, జార్ఖండ్‌లో 4, మధ్యప్రదేశ్‌లో 8, మహారాష్ట్రలో 11, ఒడిశాలో 4, పశ్చిమబెంగాల్‌లో 8, జమ్ముకశ్మీర్‌లో ఓ స్థానానికి ఎన్నికలు జరిగాయి. నాలుగో విడతతో కలిపి ఇప్పటివరకు 379 స్థానాలకు ఎన్నికలు పూర్తయ్యాయి. తక్కిన మూడు దశల ఎన్నికలు మే 20, మే 25, జూన్ 1న జరుగనున్నాయి. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

కేజ్రీవాల్ ఇంట్లో ఆప్ ఎంపీ మలివాల్‌పై దాడి!

- ముఖ్యమంత్రి సహాయకుడు దాడి చేశాడని ఆరోపణలు
- అధికారికంగా ఫిర్యాదు చేయని స్వాతి మలివాల్
- ఎన్నికల వేళ మరింత చిక్కుల్లో ఆప్

న్యూఢిల్లీ, మే 13: లోక్‌సభ ఎన్నికల వేళ ఆమ్‌ఆద్మీ పార్టీ మరో వివాదంలో చిక్కుకున్నది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అధికార నివాసంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి జరిగిందని, కేజ్రీవాల్ వ్యక్తిగత సిబ్బందిలో ఒకరు ఆమె పట్ల అనుచితంగా ప్రవర్తించారని సోమవారం మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి. పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి, కేజ్రీవాల్ పీఏ బిభవ్ కుమార్ తనపై దాడి చేసినట్టు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో ఎంపీ స్వాతి మలివాల్ ఫిర్యాదు చేశారని ఢిల్లీ పోలీస్ వర్గాలు తెలిపాయి. రాతపూర్వకంగా తర్వాత ఫిర్యాదు చేస్తానని చెప్పి.. ఆమె వెళ్లిపోయినట్టు డీసీపీ (నార్త్) ఎంకే మీనా చెప్పారు. అయితే, దాడి ఘటనపై స్వాతి మలివాల్ మీడియా ముఖంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ డిమాండ్ చేశారు. సీఎం కేజ్రీవాల్ సూచన మేరకు, ఆయన వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ సోమవారం ఆమెపై దాడి చేసినట్టు బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. దాడి ఘటనపై దర్యాప్తు చేసేందుకు విచారణ బృందాన్ని పంపనున్నట్టు జాతీయ మహిళా కమిషన్ ఒక ప్రకటన విడుదల చేసింది.

స్టార్ కాంపెయినర్ల లిస్ట్‌లో పేరు మాయం

లోక్ సభ ఎన్నికల సందర్భంగా పంజాబ్‌లో ప్రచారం చేసే స్టార్ కాంపెయినర్ల జాబితాను ఆప్ సోమవారం విడుదల చేసింది. ఈ జాబితాలో మలివాల్ పేరు కనిపించలేదు. ఇటీవల ఆప్ ప్రకటించిన ఢిల్లీ స్టార్ కాంపెయినర్ల జాబితాలో స్వాతి ఉన్నారు.

కేజ్రీవాల్‌ను గద్దె దించాలన్న పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరే చట్టబద్ధ హక్కు పిటిషనర్‌కు లేదని తెలిపింది. ఇటువంటి పరిస్థితుల్లో రాజీనామా చేయడమనేది చిత్తశుద్ధికి సంబంధించిన విషయమని వివరించింది. దీనిపై చర్య తీసుకోవడమనేది ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు సంబంధించిన అంశమని స్పష్టం చేసింది. ఢిల్లీ హైకోర్టు ఏప్రిల్ 10న ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఈ అపీలు దాఖలైంది. కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

మా అమ్మపై ప్రజ్వల్ లైంగిక దాడి

- వీడియో కాల్‌లో బెదిరించి నా దుస్తులు విప్పించాడు
- ప్రజ్వల్‌పై మరో మహిళ ఫిర్యాదు
- కిడ్నాప్ కేసులో రేవణ్ణకు బెయిల్

బెంగళూరు, మే 13: జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ కేసులో బాధిత మహిళలు మరిన్ని సంచలన విషయాలు బయటపెడుతున్నారు. తాజాగా మరో మహిళ ప్రజ్వల్ వేధింపులపై సిట్‌కు వాంగ్మూలం ఇచ్చింది. 'నాకు అతడు తరచూ వీడియో కాల్ చేసి నా దుస్తులు తొలగించమనేవాడు. లేకపోతే మా నాన్నను ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరించేవాడు. మా అమ్మకు హాని చేస్తానని బెదిరించేవాడు. మా అమ్మ వాళ్లింట్లో పని చేసేది. మా అమ్మను అతడు రేప్ చేశాడు. వాళ్లు పనివాళ్లను బానిసలుగా చూస్తారు. నేను ప్రజ్వల్‌పై ఫిర్యాదు చేశాక మా నాన్నను ఉద్యోగం నుంచి తీసేశారు' అని ఆ మహిళ వాపోయింది. తన తల్లిని ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ కూడా లైంగికంగా వేధించాడని ఆమె ఆరోపించింది. తన తల్లి నాలుగైదు నెలలకు ఒకసారి మాత్రమే ఇంటికి వచ్చేదని.. ఎప్పుడైనా అర్ధరాత్రి తర్వాతే ఫోన్ చేసి మాట్లాడేదని చెప్పింది. పండ్లు ఇచ్చే నెపంతో ప్రజ్వల్ ఇంట్లోని ఆడ పనివారిని లైంగికంగా వేధించేవాడని వచ్చిన ఆరోపణలు నిజమేనని ఆమె వెల్లడించింది. మరోవైపు మహిళ కిడ్నాప్ కేసులో రేవణ్ణకు బెంగళూరు కోర్టు రూ.5 లక్షల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేసింది. కిడ్నాపైన మహిళ రేవణ్ణ ఇంట్లో పనిచేసే మనిషేనని.. కిడ్నాప్‌పై ఎలాంటి ఆధారాలు లేవని ఆయన తరపు న్యాయవాది కోర్టులో వాదించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో బాలికల హవా

- 10, 12 తరగతుల ఫలితాలు విడుదల
- టెన్త్‌లో 93%, 12లో 88% మంది పాస్
- గతంలో కంటే పెరిగిన ఉత్తీర్ణత శాతం
- జూలై 15 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

న్యూఢిల్లీలో సంబరాలు చేసుకొంటున్న 12వ తరగతి పాసైన విద్యార్థినులు

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): సీబీఎస్ఈ 10, 12 తరగతుల ఫలితాల్లో మరోసారి బాలికలు రాణించారు. గత ఏడాదితో పోలిస్తే 90-95 శాతం మార్కులు సాధించిన విద్యార్థుల శాతం కూడా పెరిగింది. సోమవారం సీబీఎస్ఈ 10, 12 తరగతుల ఫలితాలను విడుదల చేసింది. పదో తరగతిలో 93.60 శాతం (గత ఏడాది కంటే 0.48 శాతం ఎక్కువ), 12వ తరగతిలో 87.98 శాతం (గత ఏడాది కంటే 0.65 శాతం ఎక్కువ) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సామర్థ్య ఆధారిత ప్రశ్నల సంఖ్య పెంచడం వల్ల ఉత్తీర్ణత శాతం పెరిగిందని అధికారులు తెలిపారు. అనారోగ్యకరమైన పోటీని నివారించేందుకు ఈ ఏడాది విద్యార్థుల మెరిట్ లిస్ట్, వ్యక్తిగతంగా విద్యార్థులకు ఇచ్చే ఫస్ట్, సెకండ్, థర్డ్ డివిజన్లు ప్రకటించడం లేదని వెల్లడించారు. 12వ తరగతి ఫలితాల్లో 90 శాతానికిపైగా మార్కులు సాధించిన వారిలో 262 మంది విద్యార్థులు ప్రత్యేక అవసరాలు కలిగినవారని తెలిపారు. ప్రస్తుత పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని వారి కోసం జూలై 15న సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో 10, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షలు 2025 ఫిబ్రవరి 15 నుంచి మొదలవుతాయని ప్రకటించారు.

తెలంగాణ విద్యార్థుల సత్తా

సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాల్లో జాతీయ స్థాయిలో తెలంగాణ విద్యార్థులు సత్తాచాటారు. 10, 12వ తరగతుల ఫలితాలను సీబీఎస్ఈ సోమవారం విడుదల చేసింది. 12వ తరగతి ఫలితాల్లో లక్షద్వీప్ 100 శాతంతో మొదటిస్థానంలో నిలువగా, 99.91 శాతంతో కేరళ రెండోస్థానంలో, 99.15 శాతంతో తెలంగాణ మూడోస్థానంలో నిలిచాయి. ఇక పదోతరగతి ఫలితాల్లో 99.79 ఉత్తీర్ణత శాతంతో కేరళ మొదటి స్థానంలో నిలువగా, 99.84 శాతంతో తమిళనాడు, 99.81 శాతంతో పుదుచ్చేరి, 99,66 శాతంతో ఏపీ, 99,55 శాతంతో తెలంగాణ తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో తెలంగాణ నుంచి 8,337 మంది పరీక్షకు హాజరుకాగా, 8,266 మంది (99.15శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇక పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రం నుంచి 45,669 మంది హాజరు కాగా, వీరిలో 45,465 మంది (99.55శాతం) ఉత్తీర్ణులయ్యారు.

కర్ణాటకలో 'నాథ్ ఆపరేషన్'!

- ఎన్నికలయ్యాక ప్రభుత్వం కూలుతుంది
- మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే వ్యాఖ్యలు
- కొట్టిపారేసిన సీఎం సిద్ధరామయ్య, డీకే

ముంబై, మే 13: లోక్‌సభ ఎన్నికలు కొనసాగుతున్న వేళ మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే సంచలన వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలో 'నాథ్ ఆపరేషన్' ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పతనం కావొచ్చని వ్యాఖ్యానించారు. 'నేను ఇటీవల కర్ణాటలో ఒక ర్యాలీకి వెళ్లాను. తమ రాష్ట్రంలోనూ 'నాథ్ ఆపరేషన్' అవసరమని వారన్నారు. ఏమిటీ ఆపరేషన్ అని నేడు అడిగితే.. మహారాష్ట్రలో మీరు చేసిందే అన్నారు' అని షిండే తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ ఆపరేషన్ జరగవచ్చని ఆయన పేర్కొన్నారు. అయితే షిండే వ్యాఖ్యలను కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కొట్టిపారేశారు. అది వారి భ్రమ అని.. ఎవరూ తమ ప్రభుత్వాన్ని పడగొట్టలేరని చెప్పారు. గతంలో ఇలా చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యారని.. ఇది మహారాష్ట్ర కాదని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోనుందని చెప్పారు. 'ఈ ఎన్నికల తర్వాత మహారాష్ట్రలో తన ప్రభుత్వం ఉంటుందో.. ఉండదో అని షిండేకు భయం పట్టుకుంది. అందుకే ఇలాంటి కామెంట్లు చేస్తున్నారు' అని శివకుమార్ అన్నారు.

బీజేపీ కోడ్ ఉల్లంఘనలపై చర్యలేవి?

ఇండిపెండెంట్ ప్యానెల్ ఫర్ మానిటరింగ్ ఎలక్షన్స్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ సహా, బీజేపీ నేతలు ఎన్నికల ప్రచారంలో పదేపదే మతపరమైన అంశాలను మాట్లాడుతున్నా చర్యలు తీసుకోవడంలో ఎన్నికల కమిషన్ విఫలమవుతున్నదని ఇండిపెండెంట్ ప్యానెల్ ఫర్ మానిటరింగ్ ఎలక్షన్స్ పేర్కొన్నది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియపై ఈ ప్యానెల్ ఏడో వారం పర్యవేక్షణ నివేదికను వెల్లడించింది. మోదీ మొత్తం ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, వారసత్వ పన్ను, రిజర్వేషన్లపై అబద్ధాలు చెప్తున్నారని, రామరాజ్యం, ఓట్ జిహాద్ అని ప్రస్తావిస్తున్నారని పేర్కొన్నది. అయినప్పటికీ ప్రధాని ప్రసంగాలపై ఈసీ చర్యలు తీసుకోలేదని తెలిపింది. బీజేపీ ఎంపీ అర్వింద్ ముస్లింలపై విద్వేషపు వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారని, మరో అభ్యర్థి నవనీత్ రాముడి పేరుతో ఓట్లు అడిగారని పేర్కొన్నది. సూరత్, ఇండోర్‌లో బలవంతంగా ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్ ఉపసంహరించుకునేలా చేశారని, గాంధీనగర్‌లోనూ ఒత్తిడి చేశారని పేర్కొన్నది. పోలింగ్ శాతాన్ని వెల్లడించడంలో ఈసీ ఆలస్యం చేస్తున్నదని తెలిపింది. ఎన్నికల పరిశీలనకు వచ్చిన విదేశీ ఎన్నికల సంస్థలు, రాజకీయ పార్టీలను కలవడానికి దేశంలోని పౌర సంస్థలకు ఈసీ అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించింది.

మా కుమార్తెకు ప్రేతాత్మ వరుడు కావలెను

తల్లిదండ్రుల పత్రికా ప్రకటన

బెంగళూరు: కర్ణాటకలోని పుత్తూరులో ఓ కుటుంబ పెద్దలు ఇచ్చిన పత్రికా ప్రకటన ఆసక్తికరంగా ఉంది. 30 ఏండ్ల క్రితం మరణించిన తమ కుమార్తెకు తగిన ప్రేతాత్మ వరుడు కావాలని ఈ ప్రకటనలో కోరారు. ''కులల్ కులం, బంగేరా గోత్రంలో జన్మించిన వధువుకు తగిన వరుడు కావలెను. వధువు 30 ఏండ్ల క్రితం మరణించింది. ఇదే కులం, వేరొక గోత్రంలో జన్మించిన, 30 సంవత్సరాల క్రితం మరణించిన వరుడు ఉన్నట్లయితే, ప్రేత మడువే కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఆయన కుటుంబ సభ్యులు సమ్మతిస్తే సంప్రదించండి'' అని ఈ ప్రకటనలో తెలిపారు. సంప్రదించవలసిన ఫోన్ నంబరును కూడా ఇచ్చారు. ఈ ప్రకటనపై దాదాపు 50 మంది స్పందించారని వధువు కుటుంబ పెద్ద ఒకరు చెప్పారు. ప్రేత మడువే కార్యక్రమాన్ని నిర్వహించే తేదీని త్వరలోనే నిర్ణయిస్తామన్నారు. దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాల్లోని తులునాడు ప్రాంతంలో మరణించినవారి ఆత్మలకు వివాహం చేసే ఆచారం ఉంది. జీవించి ఉన్నవారికి పెండ్లి చేసినట్లుగానే ఈ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తారు.



ఈదురు గాలుల ధాటికి ఘాట్కోపర్ ప్రాంతంలో కుప్పకూలిన భారీ హోర్డింగ్

ముంబైలో గాలివాన బీభత్సం

- భారీ హోర్డింగ్ కూలి 9 మంది మృతి
- మరో 70 మందికి గాయాలు

ముంబై, మే 13 (నమస్తే తెలంగాణ): భీకర గాలులు, అకాల వర్షంతో దేశ ఆర్థిక రాజధాని ముంబై సోమవారం చిగురుటాకులా వణికింది. భీకరగాలులకు ఘాట్కోపర్ ప్రాంతంలో అక్రమంగా ఏర్పాటుచేసిన ఓ భారీ హోర్డింగ్ పెట్రోల్ పంప్‌పై కుప్పకూలగా.. 9 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 70 మంది తీవ్రంగా గాయపడ్డారు. పెట్రోల్ పంప్, హోర్డింగ్ శిథిలాల కింద 22 మంది చిక్కుకున్నారని బీఎంసీ అధికారులు తెలిపారు. సీఎం ఏక్‌నాథ్ షిండే ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యల్ని పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు నష్టపరిహారాన్ని ప్రకటించారు. క్రేన్లు, గ్యాస్ కట్టర్లతో శిథిలాలను తొలగిస్తూ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని అధికారులు చెప్పారు. గాయపడ్డ 70 మందిని వివిధ దవాఖానలకు తరలించి వైద్య చికిత్స అందిస్తున్నామని బీఎంసీ అధికారి ఒకరు చెప్పారు. కుప్పకూలిన హోర్డింగ్‌కు కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు లేవని, అక్రమంగా అక్కడ ఏర్పాటుచేశారని బీఎంసీ కమిషనర్ భూషణ్ గాగ్రానీ చెప్పారు. భీకరమైన గాలివాన ధాటికి వడాలాలో నిర్మాణంలో ఉన్న మెటల్ పార్కింగ్ టవర్ కుప్పకూలింది. వెలుతురు సరిగా లేకపోవటంతో లోకల్ రైళ్లను, ముంబై ఎయిర్‌పోర్ట్‌లో పలు విమాన సర్వీసులను కొన్ని గంటలపాటు నిలిపివేశారు.

ప్రపంచంలోనే తొలి 6జీ డివైస్

ఆవిష్కరించిన జపాన్

టోక్యో, మే 13: ఆరో తరం (6జీ) ఇంటర్నెట్ కనెక్టివిటీని అందించటంపై అనేక దేశాలు ప్రయోగాలు చేస్తున్న తరుణంలో జపాన్ కీలక ముందడుగు వేసింది. ప్రపంచంలో మొట్టమొదటి 6జీ డివైస్‌ను ఆ దేశం ఆవిష్కరించింది. 5జీ ఇంటర్నెట్‌తో పోల్చితే 20 రెట్లు అత్యధిక వేగాన్ని కలిగివుండే 6జీ డివైస్‌ను (నమూనా పరికరం) జపాన్‌లోని వివిధ టెలికం కంపెనీలు సంయుక్తంగా తయారుచేశాయి. 300 అడుగుల ప్రాంతాన్ని కవర్‌చేసేలా 6జీ సేవల్ని అందించటం ఈ పరికరం ప్రత్యేకత. అయితే అందరూ భావిస్తున్నట్టు.. ఈ డివైస్ స్మార్ట్‌ఫోన్ కాదు. ఇదొక ప్రత్యేకమైన పరికరం. భారత్‌లో 5జీ సేవలు కొన్ని నగరాలకే పరిమితమైన సంగతి తెలిసిందే. దీంట్లో డాటా ప్రసారం 10 నుంచి 20 గిగా బైట్స్. జపాన్ తీసుకొచ్చిన 6జీ డివైస్..100 గిగాబైట్ల వేగంతో డాటాను ప్రసారం చేయగలదు. ఈ పరికరంతో నెటిజన్ తన టాస్క్‌ను కొన్ని సెకన్లలో పూర్తిచేయగలడు.

ముగ్గురు నక్సల్స్ ఎన్‌కౌంటర్

మొదటిపేజీ తరువాయి...

భామ్రాగఢ్‌లోని కాట్రాంగట్ట గ్రామ సమీప అటవీ ప్రాంతంలో పెరిమిలి దళానికి చెందిన మావోయిస్టులు శిబిరం ఏర్పాటు చేసుకున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో రెండు సీ-60 జవాన్ల బృందాలు, పోలీసులు గాలిస్తుండగా మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. ప్రతిగా భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఇరువర్గాల మధ్య సుమారు 30 నిమిషాల పాటు భీకరపోరు జరిగింది. ఘటనాస్థలం నుంచి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు వారికి సంబంధించిన మారణాయుధాలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మృతులను పెరిమిలి దళం ఇన్‌చార్జి, డివిజనల్ కమిటీ కమాండర్ వాసు, మహిళా మావోయిస్టులు రేష్మా మద్కం(25), కమ్ల మాదవి(24)గా పోలీసులు గుర్తించారు. వాసుపై రూ.16 లక్షలు, రేష్మాపై రూ.4 లక్షలు, మాదవిపై రూ.2 లక్షల రివార్డు ఉంది. ఘటనా స్థలం నుంచి ఒక ఏకే-47 రైఫిల్, ఒక కార్బైన్, ఒక ఇన్సాస్ రైఫిల్, నకల్స్ సాహిత్యం, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బారామతిలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లో సీసీటీవీలు ఆఫ్

పుణే : మహారాష్ట్రలోని బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లో సీసీటీవీ కెమెరాలు ఆఫ్ అయ్యాయని, ఆ సమయంలో ఏదో జరిగిందని ఎన్సీపీ (ఎస్‌పీ) ఆరోపించింది. ఈ నియోజకవర్గంలో ఈ నెల 7న పోలింగ్ జరిగింది. బారామతిలో ఎన్సీపీ(ఎస్‌పీ) తరపున శరద్‌పవార్ కుమార్తె సుప్రియా సూలే పోటీచేస్తుండగా, ఎన్సీపీ(అజిత్ వర్గం) నుంచి అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ బరిలో నిలిచారు. సుప్రియా సూలే తరపున ఎన్నికల ప్రతినిధి లక్ష్మీకాంత్ ఖబియా మాట్లాడుత